## గవర్నర్‌కు కలెక్టర్ ఘన స్వాగతం

సారపాక బీపీఎల్ స్కూల్ హెలీప్యాడ్ వద్ద గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సారపాక, ఏప్రిల్ 18 : రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల గురువారం సారపాకలోని బీపీఎల్ స్కూల్ హెలీప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. కలెక్టర్‌తోపాటూ ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం అతిథిగృహం వద్ద గవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించి భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి ప్రత్యేక కాన్వాయ్ ద్వారా చేరుకుని అక్కడ పూజలు నిర్వహించి పట్టాభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లోకి లక్కినేని

లక్కినేనిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

టేకులపల్లి, ఏప్రిల్ 18: మండల సీనియర్ నాయకుడు, బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు గురువారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనకు కేటీఆర్ గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. సురేందర్‌రావు గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి జడ్పీటీసీ మెంబర్‌గా గెలిచారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేశారు. కొన్నాళ్లుగా ఆ పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ ఆధ్వర్యంలో గురువారం కేటీఆర్‌ను కలిసి, బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీ మాలోత్ కవిత, నాయకుడు దిండిగాల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ భవన్ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రహరీ శంకుస్థాపనలో పాల్గొన్న జేఏసీ నాయకులు

అశ్వాపురం, ఏప్రిల్ 18 : చింతిర్యాల క్రాస్‌రోడ్ వద్దగల ఆదివాసీ భవన్ చుట్టూ నిర్మించనున్న ప్రహరీ నిర్మాణ పనులకు ఆదివాసీ మండల జేఏసీ నాయకులు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కల్లూరి నర్సింహారావు, జేఏసీ ప్రధాన కార్యదర్శి సపక నరేశ్, జేఏసీ కోశాధికారి బండ్ల రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవిఘ్నేశ్వరస్వామికి వెండి చెంబు బహూకరణ

మణుగూరుటౌన్, ఏప్రిల్ 18 : మండల కేంద్రంలోని సమితిసింగారం సాయినగర్‌లోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామికి పట్టణలలోని ప్రముఖ వ్యాపారవేత్త సంకా శ్రీనివాసరావు-కోటేశ్వరి దంపతులు 111గ్రాముల వెండి చెంబును గురువారం ఆలయకమిటీ సభ్యులకు బహూకరించారు.

## ఏఐటీయూసీలో చేరిన నాయకులు

మణుగూరుటౌన్, ఏప్రిల్ 18 : సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ నాయకులు పెద్ద ఎత్తున ఏఐటీయూసీలో చేరినట్లు బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ గురువారం తెలిపారు. ఏఐటీయూసీలో చేరినవారికి ఆయన కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మేకల ఈశ్వర్, పుల్లారావు, నంబూరి శ్రీనివాస్, ఆదెర్ల సురేందర్, సుబానీ, కోడిరెక్కల శ్రీనివాస్, రత్నం శివకుమార్, ఆంతోనీ, రవికుమార్, శరత్, జానకీప్రసాద్, రవి, శంకర్, రమేశ్ పాల్గొన్నారు.

## ముగిసిన వర్క్‌షాప్

పాల్వంచ, ఏప్రిల్ 18: స్థానిక అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీలో తృతీయ సంవత్సరం సీఎస్ఈ, ఈసీఈ విద్యార్థులకు వెబ్ డెవలప్‌మెంట్‌పై మూడు రోజుల వర్క్‌షాప్ గురువారం ముగిసింది. దీనిని తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) నిర్వహించింది. అకాడమీ ట్రైనర్ జి.అశోక్ కుమార్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ భరత్‌కృష్ణ, డైరెక్టర్ అవని, ప్రిన్సిపాల్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వెంకన్న, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ క్రాంతికుమార్, హెచ్‌వోడీలు నాగేంద్రబాబు, ప్రభాత్, సంధ్య, ప్రశాంత్, అశోక్‌కుమార్, వీరస్వామి పాల్గొన్నారు.

## సీపీఐ నాయకుల సంతాపం

మణుగూరు టౌన్, ఏప్రిల్ 18 : పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన చిప్పల రామస్వామి బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు గురువారం ఆయన స్వగృహానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి సంతాపాన్ని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్యాచారి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ర్.లక్ష్మీనారాయణలు, నాయకులు దుర్గ్యాల సుధాకర్, జి.వెంకటేశ్వర్లు, యడారి రమేశ్ ఉన్నారు.

**ప్రకటన**

ఇందుమూలముగా నాన్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **పాల్వంచ** బ్రాంచ్ వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **కోడి కృష్ణవేణి**, W/o : **కోడి అమరేందర**, వయస్సు : 37 సం॥లు, నివాసం : 2-22/1, నెల్లిపాక శివారు, మల్లెల మడుగు గ్రామ పంచాయితీ, మల్లెలమడుగు గ్రామము, అశ్వాపురం మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్రెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నాక్లయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి :** జిల్లా రిజిస్ట్రార్, ఖమ్మం, బూర్గంపహాడ్ సబ్ రిజిస్ట్రారు వారి పరిధిలో గల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండలం, నెల్లిపాక శివారు, మల్లెలమడుగు గ్రామ పంచాయితీ, మల్లెలమడుగు గ్రామం, ఇ.నెం. 2-22/1, భూమి స్థలం విస్తీర్ణం 339.60 చ॥గజాలు, ఆర్.సి.సి. బిల్డింగ్ కట్టుబడి విస్తీర్ణం 708.33 చ॥అడుగులు, **డాక్యుమెంట్ నెం. : 76/2024** గల దానికి హద్దులు : **తూర్పు** : గ్రామ పంచాయితీ రోడ్డు, **పడమర** : కోడి గంగన్న, **ఉత్తరం** : గరిగంటి వెంకన్న, **దక్షిణం** : కర్ల ఉపేందర్.

**పలివెల గణేష్ బాబు,** అడ్వకేట్, కొత్తగూడెం.
సెల్ : 9849246278

## సీడ్ ధాన్యం దగ్ధం

చర్ల, ఏప్రిల్ 18: మండలంలోని గొమ్ముగూడెం గ్రామ రైతు బిల్లిపిల్లి పుల్లారెడ్డికి చెందిన సీడ్ ధాన్యం కుప్ప బుధవారం రాత్రి దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించి ఉంటారని పేర్కొంటూ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశాడు.

# గొంతెండుతున్నది.. నీళ్లివ్వండి

వినతిపత్రం ఇచ్చిన గొత్తికోయలు

చంద్రుగొండ, ఏప్రిల్ 18: మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని బెండాలపాడు గ్రామ శివారు ఎర్రబోడులోని గొత్తికోయలు గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యాలయ ఇన్‌చార్జికి వినతిపత్రం ఇచ్చారు. తమ గ్రామంలో 47 కుటుంబాలు ఉన్నాయని చెప్పారు. గ్రామంలో తాగేందుకు నీళ్లు లేకపోవడంతో గొంతులు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు వెంకట్ రావు, రాఘవ, గణేష్, మన్ను, సింగ, రవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# తిరునాళ్ల వాల్ పోస్టర్ ఆవిష్కరించిన గవర్నర్

వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

భద్రాచలం/అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 18: స్థానిక అంకమ్మ తల్లి ఆలయ తిరునాళ్ల మహోత్సవ వాల్ పోస్టర్‌ను రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ గురువారం భద్రాచలంలోని ఐటీసీ అతిథి గృహంలో ఆవిష్కరించారు. భద్రాద్రిలో గురువారం రామయ్య పట్టాభిషేక మహోత్సవానికి గవర్నర్ వచ్చారు. ఐటీసీ అతిథి గృహంలో గవర్నర్‌ను అన్నపురెడ్డిపల్లి శివాలయం పునఃనిర్మాణ వ్యవస్థాపకుడు మారగాని శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి, ఈ నెల 19 నుంచి 23 వరకు జరిగే అంకమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవానికి ఆహ్వానించారు. ఆలయ విశిష్టతను గవర్నర్‌కు వివరించారు. అక్కడే, తిరునాళ్ల వాల్ పోస్టర్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, గవర్నర్ సంయుక్త కార్యదర్శి భవానీశంకర్, ఆధ్యాత్మికవేత్త దైవజ్ఞ శర్మ, భద్రాద్రి రామాలయం ఈవో రమాదేవి పాల్గొన్నారు.

**నేటి నుంచి 23 వరకు తిరునాళ్ల మహోత్సవం**

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 18: స్థానిక అంకమ్మ తల్లి దేవాలయంలో శుక్రవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు తిరునాళ్ల మహోత్సవం జరగనుంది. తొలి రోజు శుక్రవారం మైలపట్నం, కొలబియ్యం, పుట్టబంగారం, 20న జలబిందెలు, గ్రామబండి, గ్రామ సేవ, 21న రడకప్పెర, గ్రామ సేవ, 22న కుంకుమార్చన, ప్రభ బండ్లపై గుడిబండ ఊరేగింపు, 23న అగ్ని గుండ ప్రవేశం, బద్దె గొర్రె, 23న శ్రీగోపయ్య- తిరుపతమ్మ అమ్మవార్ల కల్యాణ మహోత్సవం ఉంటాయి.

## పేద విద్యార్థుల చదువులే లక్ష్యం

గ్రంథాలయం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న చేయూత ట్రస్ట్ బాధ్యులు

బూర్గంపహాడ్, ఏప్రిల్ 18 : నిరుపేద విద్యార్థుల చదువులే లక్ష్యంగా మోరంపల్లిబంజర్ గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం గ్రంథాలయం ఏర్పాటుకు ట్రస్ట్ బాధ్యులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు, చైర్మన్ లక్ష్మినారాయణరెడ్డి మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే అది విద్యవల్లే సాధ్యమవుతుందని భావించి తమ ట్రస్ట్ ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. గ్రంథాలయాన్ని త్వరలోనే ఏర్పాటు చేసుకుని అందులో అన్నిరకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించేలా కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దివ్య, కైపు సుబ్బిరామిరెడ్డి, మేడం లక్ష్మినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మణుగూరుటౌన్, ఏప్రిల్ 18 : రామానుజవరం 11కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8.30గంటల నుంచి 10గంటల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు గురువారం తెలిపారు. మండలంలోని రామానుజవరం, తిర్లాపురం, సాంబాయిగూడెం, దమ్మక్కపేట, చిక్కుడుగుంట, పగిడేరు, శాంతినగర్, గొల్లకొత్తూరు, కోడిశాలకుంట, బుగ్గ, ఖమ్మంతోగు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

## ఆ సారు.. బడి ఎగ్గొట్టారు..!

**పిల్లలు బడి ఎగ్గొడితే.. 'ఇది సాధారణమే'నని సరిపెట్టుకుంటాం. కానీ, టీచరే బడి ఎగ్గొడితే.. అది అసాధారణ విషయంగా పరిగణిస్తాం. అక్కడి పిల్లల తల్లిదండ్రులు కూడా అలాగే అనుకున్నారు. ఆగ్రహోదగ్రులయ్యారు.. బడి వద్ద నిరసన తెలిపారు.**

పాఠశాల వద్ద పిల్లలు, తల్లిదండ్రులు

ములకలపల్లి, ఏప్రిల్ 18: మండలంలోని తిమ్మంపేటలో గిరిజన సంక్షేమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. ఇది ఏకోపాధ్యాయ పాఠశాల. ఇక్కడ ఎస్‌జీటీగా ఎల్.కృష్ణ పనిచేస్తున్నారు. ఈ బడిలో ఏడుగురు మాత్రమే పిల్లలు ఉన్నారు. నిన్నటి రోజున (గురువారం) ఈ పిల్లలు వీధుల్లో ఆడుకుంటుండగా తల్లిదండ్రులు చూశారు. బడి వదిలిపెట్టి, ఇలా ఆడుతున్నారేమిటని ప్రశ్నించారు. 'సార్ రాలేదు.. బడి లేదు..' అని ఆ పిల్లలు బదులిచ్చారు. ''పిల్లలు బుద్ధిగా బడికి వెళ్లారు.. టీచరేమో ఎగనామం పెట్టారు..! ఇలాగైతే మా పిల్లలకు చదువెలా వస్తుంది..? వాళ్ల బతుకులెలా బాగుపడతాయి..?'' అనుకుంటూ, కోపోద్రిక్తులైన ఆ తల్లిదండ్రులు, ఎస్ఎంసీ చైర్మన్.. నేరుగా బడి వద్దకు వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే అక్కడకు కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ సత్యనారాయణ, పే సెంటర్ హెడ్ మాస్టర్ కె.వెంకటేశ్వర్లు చేరుకున్నారు. తల్లిదండ్రులు, ఎస్ఎంసీ చైర్మన్ తమ నిరసనను తెలిపారు. వారి నుంచి ఆ ఇద్దరు హెడ్ మాస్టర్లు రాతపూర్వకంగా ఫిర్యాదు స్వీకరించారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలుపుతామని చెప్పి వెళ్లిపోయారు.

# మూడు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

జూలూరుపాడు, ఏప్రిల్ 18: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఏన్కూరు మండలంలోని భగవాన్ నాయక్ తండాకు చెందిన ధరావత్ రాములు(45), నరేష్ కలిసి ద్విచక్ర వాహనంపై గురువారం సుజాతనగర్‌లో బంధువుల ఇంట శుభకార్యానికి వెళ్లి తిరిగొస్తున్నారు. జూలూరుపాడు మండలంలోని సాయిరాం తండాకు చెందిన తేజావత్ చరణ్, బానోత్ చందర్ కలిసి ద్విచక్రవాహనంపై గురువారం జూలూరుపాడు వచ్చి తిరిగి వెళ్తున్నారు. సాయిరాం తండా సమీపంలో ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఒక వాహనం వెనుక కూర్చున్న రాములు, తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. నరేష్, మరో వాహనంపై ఉన్న చందర్, చరణ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 సిబ్బంది కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని ఎస్సై జీవన్ రాజు, ఏఎస్సై తిరుపతిరావు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**లారీ ఢీకొని వృద్ధుడు..**

చంద్రుగొండ, ఏప్రిల్ 18: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. విజయవాడ నగరానికి చెందిన ప్రైవేట్ రిటైర్డ్ టీచర్ ఆత్కూరు శ్రీకృష్ణ చక్రపాణి(60) గురువారం తెల్లవారుజామున అక్కడి నుంచి స్కూటీపై భద్రాచలం రామాలయానికి బయల్దేరారు. మార్గమధ్యంలో చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెం గ్రామ మూలమలుపు వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొని ఆగకుండా వెళ్లింది. కింద పడిపోయిన చక్రపాణి అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన భార్య త్రయాదతి ఫిర్యాదుతో హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

**కారు ఢీకొని యువకుడు..**

అశ్వారావుపేట, ఏప్రిల్ 18: కారు ఢీకొనడంతో యువకుడు మృతిచెందాడు. పట్టణంలోని శివయ్య గారి బజార్‌కు చెందిన బైక్ మెకానిక్ లోకాల రాము(19), తన స్నేహితుడు జీళ్ళ భానుతో కలిసి ఊట్లపల్లి సమీపంలోని వెంకమ్మ చెరువు నుంచి బైక్‌పై అశ్వారావుపేటకు బయలుదేరారు. ఏపీలోని కుక్కునూరు మండలం రాజీవ్ నగర్‌కు చెందిన కారు అశ్వారావుపేట నుంచి వెళ్తున్నది. ఇవి రెండూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. రాము అక్కడికక్కడే మృతిచెందాడు. భానుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద స్థలాన్ని ఎస్సై శ్రీరాముల శ్రీను పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి, భానును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసును ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

## వడదెబ్బతో కూలీ మృతి

టేకులపల్లి, ఏప్రిల్ 18: వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతిచెందాడు. మండలంలోని చింతోనిచెలక గ్రామానికి చెందిన సూర్ణపాక లక్ష్మయ్య(52) రోజూ వ్యవసాయ కూలీ పనులుకు వెళ్తున్నాడు. ఈ నెల 16న సాయంత్రం కూలీ పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో పడిపోయాడు. అక్కడి స్థానికులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న అతడు బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈయనకు భార్య. ఇద్దరు సంతానం ఉన్నారు.

## చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

భద్రాచలం, ఏప్రిల్ 18: చెల్లని చెక్కు కేసులో ఓ వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ, రూ.4లక్షలను ఫిర్యాదికి చెల్లించాలని భద్రాచలం జ్యూడీషియల్ కోర్టు గురువారం తీర్పునిచ్చింది. వాది తరపు న్యాయవాదులు తెలిపిన వివరాలు.. యటపాకకు చెందిన వరకా శ్రీనివాస్, తన అవసరాల కోసం లింగమర్ల శ్రీనివాసరావు నుంచి రూ.4లక్షలు అప్పు తీసుకున్నాడు. కొన్నాళ్ల తర్వాత అప్పు తీర్చేస్తున్నట్లుగా చెక్కు ఇచ్చాడు. దీనిని లింగమర్ల శ్రీనివాసరావు బ్యాంకులో జమ చేశారు. ఖాతాలో తగినంత నగదు లేకపోవడంతో అది చెల్లుబాటు కాలేదు. దీంతో శ్రీనివాసరావు తన న్యాయవాదులు పడవల శ్రీనివాస్, పామరాజు తిరుమల రావు ద్వారా 2016లో పట్టణంలోని జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టులో కేసు వేశారు. ఈ కేసులో వరకా శ్రీనివాస్‌పై నేరం రుజువవడంతో అతడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ, ఫిర్యాదీకి రూ.4లక్షలు చెల్లించాలని పేర్కొంటూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సూరిరెడ్డి గురువారం తీర్పునిచ్చారు. డబ్బు చెల్లించని పక్షంలో అదనంగా మరో నెలపాటు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

## వృద్ధుడి ఆత్మహత్య

అశ్వారావుపేట, ఏప్రిల్ 18: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని కోత మిషన్ బజార్‌కు చెందిన బమ్మిడి సాంబయ్య (62)కు 15 ఏళ్ళ కిత్రం కడుపుపై కణితి ఏర్పడింది. చికిత్స చేయించుకున్నప్పటికీ ఫలితం కనిపించలేదు. అప్పటి నుంచి నొప్పితో తీవ్రంగా బాధపడుతున్నాడు. ఈ బాధ భరించలేక బుధవారం రాత్రి ఇంట్లో విషపున గుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుమార్తె భారతి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

## విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

చంద్రుగొండ, ఏప్రిల్ 18: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాలు.. మండలంలోని పోకలగూడెం గ్రామస్తుడు బానోత్ రాముకు చెందిన దుక్కిటెద్దు గురువారం ఉదయం మేత కోసం చేలల్లోకి వెళ్లింది. అక్కడ తక్కువ ఎత్తులోగల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతోనే విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. దీని విలువ రూ.70వేలు ఉంటుంది.

## వేడుకలు విజయవంతం.. యంత్రాంగానికి అభినందనలు

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 18: భద్రాచలంలో రెండు రోజుల పాటు శ్రీరామనవమి, మహా పట్టాభిషేకం వేడుకలు విజయవంతంగా నిర్వహించిన అధికార యంత్రాగానికి రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ప్రకటన చేశారు. నవమి రోజున భద్రాచలంలో 60 తలంబ్రాల కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు, ఆర్టీసీ బస్సుల్లో భక్తులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

## పర్ణశాలలో వైభవంగా రథోత్సవం

రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పర్ణశాల, ఏప్రిల్ 18: సీతారాముల కల్యాణ మహోత్సవంలో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో గురువారం రాత్రి అర్చకులు, అధికారులు స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శోభాయమానంగా జరిగిన ఈ యాత్రలో నూతన వధూవరులుగా సీతారాములు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఈ రథోత్సవం.. విశ్రాంతి మంటపం వద్దకు వెళ్లింది. అమ్మవారు, స్వామివారు అక్కడ రెండు నిమిషాలు విశ్రాంతి తీసుకున్నారు. తర్వాత తిరిగి ఆలయంలోకి ప్రవేశించారు.

## కరపత్రం ఆవిష్కరణ

టేకులపల్లి, ఏప్రిల్ 18: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మనువాద ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదామని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుదామని పిలుపునిస్తూ తెలంగాణ ప్రజా ఫ్రంట్ రూపొందించిన కరపత్రాన్ని రాష్ట్ర కో కన్వీనర్ మంతెన సంజీవరావు గురువారం టేకులపల్లిలో ఆవిష్కరించారు. నాయకులు ఎట్టి ప్రశాంత్, లఘుపతి తదితరులు పాల్గొన్నారు.

## రైతులను మోసగిస్తున్న దళారులు

సారపాక, ఏప్రిల్ 18 : బూర్గంపహాడ్ మార్కెట్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంత రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకున్న ధాన్యం, పత్తి, మిర్చి వ్యాపారులు దగాకు పాల్పడుతున్నారని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పున్నం చంద్ ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతులు కష్టపడి పండించిన పంటను విక్రయించే సమయంలో దళారులు రంగ ప్రవేశం చేసి అందిన కాడికి దండుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తూకాల్లో మోసం చేస్తూ రైతులకు కుచ్చుటోపీ పెడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి దళారుల వ్యవస్థకు అడ్డుకట్ట వేసి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అశ్వారావుపేట, ఏప్రిల 18: పట్టణంలోని మెరుపు కాలనీలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన పోలయ్య కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు అభిమానుల సంఘం 'జలగం యువ సేన' గురువారం రూ.7వేలు అందజేసింది. అధ్యక్షుడు చిక్కం గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు శ్రీను, పటేల్ శ్రీను, మెట్టా వెంకటేష్, తాండ్ర సాత్విక్, భరత్, భార్గవ్, మణి, రాం తేజ, సురేష్, గౌరి పాల్గొన్నారు.

## జడ్పీ హైస్కూల్‌కు కంప్యూటర్లు అందజేత

కంప్యూటర్లు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 18: మండలంలోని జగన్నాథపురం జడ్పీ హైస్కూల్‌కు తాండ్ర నారాయణరావు ట్రస్ట్ తరపున చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు గురువారం రూ.3.50 లక్షల విలువైన ఆరు కంప్యూటర్లను అందజేశారు. వీటిని ప్రధానోపాధ్యాయుడు శ్రీరామ్మూర్తి స్వీకరించారు. ట్రస్ట్ ఆర్గనైజర్ నరాటి ప్రసాద్, గ్రామస్తులు కొండం వెంకన్న, పుల్లయ్య, వెంకటనారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 18: మండలంలోని శ్రీనగర్ కాలనీ పంచాయతీ ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అనుబంధంగా ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లల కేంద్రం (భవిత)లో గురువారం ఫిజియోథెరపీ శిబిరం ఏర్పాటైంది. కృత్రిమ అవయవాల తయారీ కార్పొరేషన్ నుంచి వచ్చిన అలవెన్సులను జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ సైదులు అందించారు. హెచ్ఎం మేకల జ్యోతిరాణి, ఫిజియోథెరపిస్